తలుపు తోసింది కాని తెరుచుకోలేదు. లోపల గడియ వేసుకున్నారెవరో. అలక కోలీగ్ కాలింగ్‌బెల్ నొక్కాడు.

"ఎవరు?" తన భర్త గొంతు వినిపించడంతో అలకలోని టెన్షన్ తగ్గింది. ఆయనకి సంగతి తెలిసి వచ్చి నిప్పు ఆర్పాలనుకుంది అలక.

"తలుపు తీయండి" అలక కోలీగ్ చెప్పాడు.

తలుపు తెరిచి లుంగీలోవున్న అమర్ అలకని చూసి వులిక్కిపడ్డాడు.

"మీకూ ఫోన్ చేసిందా పక్కింటి పిన్నిగారు। నిప్పు యెలా అంటుకుంది....?"

వంటగదిలోకి వెళుతూ, పడక గదిలో తమ మంచం మీద నగ్నంగా దుప్పటికింద పడుకుని వున్న పక్కింటి పిన్నిగారిని చూసి నిర్ఘాంతపోయింది అలక.

"ఒకోసారి సరదాగా ఆడే అబద్దం ఇలా మేలు చేసుందని తెలీదు. నిన్న ఏప్రిల్ ఫస్టుకాబట్టి నిన్ను ఫూల్‌ని చేద్దామని మీ పక్కింటి పిన్నిగారు ఫోన్ చేసిందని సరదాగా అబద్ధం ఆడానంతే" మర్నాడు విడాకుల కోసం కోపంగా లాయర్ దగ్గరకెళ్లి వచ్చిన అలకతో ఆమె ఆఫీసర్ చెప్పారు సంగతి తెలుసుకొని.

# మొందటి భర్త

హైదరాబాద్‌లో ఓ మంచి లొకాలిటీ అది. అక్కడ ఏడంతసుల అపార్టుమెంట్స్ ఒకటి అప్పుడే పూర్తయింది. అంతసుకి అయిదు చొప్పున మొత్తం ముప్పయి అయిదు ఫ్లాట్స్ వున్నాయి. వాటిని ముందరే బుక్ చేసుకున్న ముప్పయి అయిదుమంది ప్రమోటర్స్ ఒక్కొక్కరే తను ఫ్లాట్స్‌లోకి మారే రోజులవి.

సాధారణంగా ఫ్లాట్స్‌లోని వుడ్ వర్క్ — అలమరాలకి తలుపులు మొదలయినవి — బిల్డింగు కాంట్రాక్టరు ఏర్పాటు చేయడు. వాటిని యజమానులు తమకు నచ్చినరీతిలో చేయించుకుంటారు.

రెండో అంతస్తులోని నాలుగో ఫ్లాట్ ఉత్పల్‌దత్‌ది. ఆయనకు వెండి, బంగారం వ్యాపారం వుంది. ఇంతకాలం అద్దె యింటిలో వుంటున్నాడు.

ఉత్పల్‌దత్ తన భార్యతో తరచు తన ఫ్లాట్‌కి వచ్చి భార్య సూచనల ప్రకారం వంటగదిలో హాల్లో, బెడ్‌రూంములో వార్డ్ రోబ్‌లకి అల్మైరాలకి కావలసిన కొలతలు తీసుకుని వాటికి తలుపులు వేయించసాగాడు. ఇద్దరు వడ్రంగి పనివారు రోజూ వుదయం తొమ్మిదినుంచి ఆరున్నరదాకా వడ్రంగిపని చెయ్యసాగారు. ఆయన భార్య దగ్గరుండి యజమాయిషీ చేస్తుంటే, ఆయన దుకాణం చూసుకుంటూ వీలున్నప్పుడల్లా డెకోలం, అల్యూమినియం పట్టీలు. గాసులులాంటి వస్తువులని తెప్పిస్తున్నాడు. ఆ ఫ్లోర్‌లో దాదాపుగా అందరూ భార్యలే ఆ పనులు చూసుకుంటున్నారు.

ఉత్పల్‌దత్ ఎదురు ఫ్లాట్‌లోని వాళ్ళకూడా త్వరలో రావాలనే వుద్దేశంతో తమ ఫ్లాట్‌లో అలమరాలకి తలుపులు బిగించుకునే ఏర్పాటు చేసుకుంటున్నారు. అందులోకూడా ఇద్దరు వడ్రంగులు పని చేస్తున్నారు

ఉత్పల్‌దత్ భార్య స్త్రీ సహజమయిన కుతూహలంతో ఎదురింటి ఆమెని చూడసాగింది. ఆమె వయసు ముప్ఫయిదాకా వుంటుంది. ఆమె భర్త వయసు ఏభై పైబడి వుండడంతో ఉత్పల్‌దత్ భార్యకి కొద్దిగా ఆశ్చర్యం కలిగింది.

ఎదురింటావిడపేరు ముక్తిమణి అని తెలుసుకుంది మిసెస్ ఉత్పల్ దత్. ఆవిడ మరో వింత సంగతి గమనించింది

ముక్తిమణి భర్తకి ఆమె అంటే ఎంతో గౌరవం. కొద్దిపాటి భయం. అద్దాల తలుపులు ఫలానా విధంగా వుంటే బావుంటుందని ఆయన సజెస్టుచేసే, ముక్తిమణికి నచ్చదు ఇంకోవిధంగా వుండాలంటుంది. ఆయన ఇక ఆ విషయం చర్చించడు. అంగీకారంగా తల వూపుతాడు.

ముక్తిమణి ఎంతమాత్రం మర్యాద చూపించదు తన భర్త విషయంలో. ఆయన స్కూటరుమీద ఇద్దరూ వెళ్ళి కావలసిన సామాను తీసుకొస్తారు. కిందనుంచి వాటిని ఆయనే మోసుకు వెళతారు. లేదా ఒకోసారి సామానెక్కువుంటే ఆటోలో వేసుకుని తెస్తాడు. ముక్తిమణి భర్తమీద మిసెస్ ఉత్పల్‌దత్‌కి కొద్దిగా జాలి కలిగిందికూడా.

మిసెస్ ఉత్పల్‌దత్ గృహ ప్రవేశానికి ముక్తిమణిని ఆహ్వానించింది! ఆమె ఒక్కతే వచ్చింది.

"మీభర్త రాలేదే!" అడిగింది మిసెస్‌ఉత్పల్‌దత్.

"మద్రాస్‌లో వున్నారు" చెప్పింది ముక్తిమణి.

వారం తర్వాత ముక్తిమణి గృహప్రవేశానికి ఉత్పల్‌దత్ కుటుంబము హాజరవలేక పోయారు. పది రోజులు ఫ్లాట్‌కి తాళం వేసి వాళ్ళు ఢిల్లీ వెళ్ళి వచ్చారు.

ముక్తమణి ముక్తసరిగా వుండే స్వభావం.

కాబట్టి మిసెస్ ఉత్పల్‌దత్‌ని అట్టే సహకరించేది కాదు.

మిసెస్ ఉత్పల్‌దత్‌కి ఎంతో ఆశ్చర్యం వేసింది. ముక్తిమణి భర్త వూళ్ళో వున్నట్లు లేదు. ఓ ముప్పయి ఆరేళ్ళ యువకుడు ఇప్పుడామె ఇంట్లో ఆమెతో వుంటున్నాడు. ఇద్దరూ కలసి స్కూటరుమీద షికార్లకి వెళ్ళడం, పూసుకుని తిరగడం....

ముక్తిమణి అంటే అసహ్యం వేసింది మిసెస్ ఉత్పల్‌దత్‌కి.

"మావారి పుట్టిన్రోజు. సాయంత్రం పార్టీకి రండి" ఆహ్వానించింది ముక్తిమణి ఆవిడని ఓరోజు.

"మీరు తప్పక రావాలి" ఆమెతో వచ్చిన ఆ యువకుడుకూడా ఆహ్వానించాడు

"మీ భర్త ఎప్పుడు వస్తారు!" అడిగింది మిసెస్ ఉత్పల్‌దత్ ముఖం చిట్లించి చూస్తూ.

క్షణకాలం వాళ్ళిద్దరూ తెల్లబోయారు ఆ మాటలకి.

"ఈయనే నా భర్త" పరిచయం చేసిందిముక్తమణి తన ప్రక్క నున్న యువకుణ్ణి.

ఈసారి తెల్లబోవటం మిసెస్ ఉత్పల్‌దత్ వంతయింది.

"మరి ఆయన....!" అడిగింది.

"ఎవరు!"

"మీతో పాటు వుడ్ వర్క్‌కి అటెండయిన ముసలాయన!"

ముక్తమణి చిన్నగా నవ్వి అడిగింది.

"కొంపతీసి ఆయన నా భర్తనుకున్నారా! మా వుడ్ వర్క్ కాంట్రాక్టర్. మా ఆయన ఆఫీస్‌టూర్లో వుండగా నేనే ఇక్కడి పనులు చూసుకునే దాన్ని"

"ఓ సారీ"

ముక్తమణి మళ్ళీ చిన్నగా నవ్వి చెప్పింది.

"మన ఫ్లాట్స్‌లో వుండే వాళ్ళం ఒకరితో వొకరు మాట్లాడుకోక పోవటంవల్ల ఇలాంటి ఇబ్బందులు కూడా వుంటాయన్నమాట. ఇక నించి ఈ ఆచారం మానేయాలి."

## కళ్ళు

జ్ఞానమూర్తంటే వనజకి ఎనలేని ప్రాణం. వనజన్నా జ్ఞానమూర్తికి పంచప్రాణాలు. తన రెండుకళ్ళతో సమానం ఎందుకంటే, జ్ఞానమూర్తికి రెండుకళ్ళూ లేవు. గ్రుడ్డివాడు. ఇద్దరూ ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళయాక ప్రేమించుకున్నారు.

పెళ్ళయ్యాక, కాలం ఎదురు తిరగడం చేత గ్రుడ్డివాడయాడు జ్ఞానమూర్తి కంట్లో స్పార్క్ పడి. నాలుగేళ్ళుగా అలాగే కాలం గడుపు